జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 4-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 62 పేజీలు: 8 వెల : రూ.7

# ప్రైవేట్ విద్యాసంస్థలు..
# వ్యాపార కేంద్రాలు






* వ్యాపార సంస్థలుగా విద్యాలయాలు * నర్సరీ నుంచి టెన్త్ వరకూ ఫీజుల పేరిట దోపిడీ * పుస్తకాలు, యూనిఫారాలు కూడా విక్రయాలు
* క్వాలిఫైడ్ ఉపాధ్యాయులను నియమించని యాజమాన్యం
* కార్పొరేట్ పాఠశాలల్లో మౌలిక వసతులు అంతంత మాత్రమే
* అపార్టుమెంట్లలో ప్రైవేట్ పాఠశాలలు
* జాడలేని అగ్ని ప్రమాద నివారణ పరికరాలు * ఫీజుల నియంత్రణ కేవలం ప్రకటనలకే * రిజిస్ట్రేషన్లు లేకుండా కొన్ని పాఠశాలల నిర్వహణ
* కార్పొరేట్ బడుల్లో పేదలకు ఉచిత విద్య కాగితాలకే * నిబంధనలు పాటించని పలు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు * విద్యాసంస్థల తనిఖీ మొక్కుబడే * నోటీసులకే పరిమితమవుతున్న విద్యాశాఖ



**శ్రీకాకుళం, జులై3 (వార్త):**

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు వ్యాపార సంస్థలుగా మారాయి. నర్సరీ నుంచి టెన్త్ వరకూ ఫీజుల రూపంలో లక్షలకు లక్షలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దోచేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫారాలను కూడా పాఠశాలల యాజమాన్యాలే విక్రయిస్తూ కాసులు చేసుకుంటున్నారు. విద్య పేరిట వ్యాపారం మొదలెట్టేశారు. ఏ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లోనూ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉండరు. ఉన్నా కొద్ది మంది మాత్రమే. ఆయా పాఠశాలల్లో కనీస సదుపాయాలు ఉండడం లేదు. పాఠశాలలు సైతం ఇరుకైన బహుళ అంతస్థుల భవనాల్లో నిర్వహిస్తున్నారు. అగ్ని ప్రమాదాలు జరిగితే నివారించే పరికరాలు ఉండడం లేదు. పరికరాలు ఉన్నా అవి పని చేయడం లేదు. బాలల హక్కుల చట్టం, విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల ఆవరణలో క్రీడా మైదానాలు ఉండాలి. వాటి జాడే కానరాదు. ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు ఎంతమేరకు వసూలు చేస్తున్నారన్న దానిపై బోర్డును ఏర్పాటు చేయాలి. ఆ బోర్డులో ఉన్న ఫీజుకు, వసూలు చేస్తున్న దానికి అసలు పోలికే ఉండదు. మరో విషయమేమిటంటే ఈటెక్నో, ఒలింపియడ్, ఐఐటీ, సీబీఎస్ఈ.. ఇలా పలురకాల కోర్సుల పేరుతో ఫీజు లను విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారు. ఈ విద్యా సంస్థల్లో 25 శాతం మంది పేదలకు ఉచిత విద్యను అందిం చాలి. యాజమాన్యం మాత్రం పేదలకు ఉచిత విద్యను అంది స్తున్నట్టు కాగితాలకే పరిమితం చేస్తున్నారు. ఈ నిబంధన తక్కువ పాఠశాలల్లో మాత్రమే అమలవుతోంది. యాజమాన్యం మాత్రం వారి ఆబ్లిగేషన్ ఉన్న పిల్లలకు మాత్రమే ఉచిత విద్యను అందిస్తూ పేదలకు ఇస్తున్నట్టు రికార్డుల్లో చూపుతోందన్న విమర్శలు ఉన్నాయి.

## ఫీజుల దోపిడీ..

శ్రీకాకుళం జిల్లాలో సుమారు 300కు పైగానే కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో స్కూల్‌లో ఒక్కో రకంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలలో 3,4,5 తరగతుల విద్యార్థులకు ఒక రకంగా, 6,7,8 తరగతులకు మరోరకంగా, 9,10 తరగతులకు ఇంకో రకంగా ఫీజులు తీసుకుంటున్నారు. 3 నుంచి 5 వరకూ శ్రీకాకుళం నగరంలోని పలు కార్పొరేట్ పాఠశాలల్లో రూ.45 నుంచి రూ.50వేలు వరకూ ఫీజు, పుస్తకాలకు రూ.10వేలు, రూ.5 బిల్డింగ్ ఫండ్ కింద లాగేస్తున్నారు. 6 నుంచి 9 వరకూ ఫీజు కింద రూ.50 నుంచి రూ.70వేలు, పదో తరగతికి రూ.70వేలు నుంచి రూ.80 వేలు వరకూ వసూలు చేస్తున్నారు. ఏసీ, నాన్ ఏసీ క్యాంపస్‌లు కూడా నిర్వహిస్తూ అదనంగా మరో రూ.20వేలు నుంచి రూ.30వేలు వరకూ తల్లిదండ్రులపై భారం మోపుతున్నారు.

## మొక్కుబడిగా తనిఖీలు

కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ కేవలం ప్రకటనలకే పరిమితమైంది. పలు పాఠశాలల్లో నిబంధనలు పాటించకపోయినా విద్యాశాఖాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. విద్యాసంస్థల్లో అగ్నిమాపక నియంత్రణ పరికరాలు లేకపోయినా అగ్నిమాపక సిబ్బంది తనిఖీలు చేయడం లేదు. అగ్నిమాపక శాఖ మాత్రం కేవలం అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా అవగాహన కల్పించడానికే పరిమితమవుతున్నారు. ఫీజుల నియంత్రణకు అధికారులతో ఒక కమిటీ ఉన్నా దాని జాడే లేదు. ఎవరైనా ఫీజుల విషయమై సంబంధిత యాజమాన్యాలకు ప్రశ్నిస్తే ఇష్టం ఉంటే చదివించండి.. లేకుంటే పొండి అన్న మాదిరిగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఎవరైనా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల యాజమాన్యంపై విద్యాశాఖకు ఫిర్యాదు చేస్తే నోటీసులు ఇవ్వడానికే పరిమితమవుతున్నారు. ఇకనైనా విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీ, నిబంధనలు బేఖాతర్‌పై జిల్లా విద్యాశాఖాధికారులు, అగ్నిమాపక శాఖాధికారులు స్పందిస్తే విద్యార్థుల తల్లిదండ్రులకు మేలు చేసే వారవుతారన్న అభిప్రాయం ప్రతి ఒక్కరిలో ఉంది. ఏం చేస్తారో చూడాలి మరి.

# వైభవంగా.. కూర్మ జయంతి

**గార, జులై 3 (వార్త):** శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రంలో బుధవారం కూర్మ జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి దైనందిన కార్యక్రమాల అనంతరం ఆలయంలోని బేడా మండపంలో గోవిందరాజస్వామి ఉత్సవ విగ్రహంపై పసుపు నీళ్లు పోసి వేడుకను ప్రారంభించారు. ప్రధాన అర్చకుడు చామర్ల సీతారామ నృసింహాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆసనంపై ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఇన్‌ఛార్జి ఈవో గురునాథరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నగరపాలక కమిషనర్‌గా.. ఓబులేసు



* విధుల్లో చేరిన కమిషనర్
* శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు

**శ్రీకాకుళం, జులై 3 (వార్త):**
శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. బుధవారం ఆయన నగరపాలక సంస్థ కార్యాలయంలో తన బాధ్యతలను స్వీకరించారు. కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కాగా, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఉన్న ఓబులేష్ ఎన్నికల ముందు సుడా వైస్ చైర్మన్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జిల్లా కలెక్టర్ సతీమణి ఐఏఎస్ అధికారి తమీమ్ అన్సారియాను ప్రభుత్వం నియమించింది. ఇటీవల ఆమెను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా నియమించారు. దీంతో ఆమె రిలీవ్ అయ్యారు. దీంతో ఆమె స్థానంలో పూర్తిగా అదనపు బాధ్యతలతో కమిషనర్‌గా ఓబులేష్‌ను నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## 200 మందికి వైద్య సేవలు

**నరసన్నపేట/జలుమూరు, జులై 3 (వార్త):** నరసన్నపేట మండలం పారసెల్లి పంచాయతీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ డబ్బీరు కిరణ్ పట్నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో జెమ్స్ వైద్యులు 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు పెరుగుతున్న దృష్ట్యా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.

# న్యాయమైన డిమాండ్లు పరిష్కరించండి

**పాతపట్నం/కొత్తూరు, జులై 3 (వార్త):** తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, సమ్మె ఒప్పందంలో జీవోలను అమలు చేయాలని కోరుతూ పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యుడు మామిడి. గోవిందరావును ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కె.వి. హేమలత, కె.లక్ష్మీ, సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ అంగన్వాడీ లు ఐక్య పోరాటం ఫలితంగా గత ప్రభుత్వం సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాలను మినిట్స్ కాఫీ ఆధారంగా జీవోలు ఇవ్వాలన్నారు. అంగన్వాడీలకు గౌరవ వేతనం కాకుండా కనీస వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎం.సుదీష్ణ, రోహిణి, జయలక్ష్మి, సాయికుమారి, రమా, రమణమ్మ, నిర్మల, అరుణ పాల్గొన్నారు.

## ఉద్యోగాల కల్పనే ప్రధాన అజెండా

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పనే ప్రధాన అజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు.

## ఎమ్మెల్యే ఎంజీఆర్‌ను కోరిన అంగన్వాడీలు



బుధవారం పాతపట్నం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉచిత శిక్షణ కల్పించాలని కోరుతూ డీఎస్సీ అభ్యర్థులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెగా డీయస్సీపై మెదటి సంతకం పెట్టారన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తగ్గిస్తారన్నారు. రాష్ట్ర స్థాయి ఫ్యాకల్టీతో తన ట్రస్ట్ ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు.

## బైదలాపురం పీహెచ్‌సి తనిఖీ

పాతపట్నం మండలం బైదలాపురం పీహెచ్‌సీని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. వైద్యులు అందుబాటులో ఉండడం లేదని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. రికార్డులు సక్ర మంగా నిర్వహించకపోవడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలో ఉండి సేవలు అందించాలన్నారు.








## కౌలు రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి

**ఆమదాలవలస, జులై 3(వార్త):** జిల్లాలోని ఉన్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డు తప్పనిసరి అని ఫార్మర్ ట్రైనింగ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.త్రినాధ్ స్వామి అన్నారు. బుధవారం దూసిలోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రానికి దరఖాస్తు చేసుకొని గుర్తింపు కార్డులు పొందాలన్నారు. కౌలు హక్కు పొందిన రైతులకు పంట నష్ట పరిహారం, పంటల బీమా, అన్నదాత సుఖీభవ, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మొదలగు వాటికి సబ్సిడీపై రైతులకు అందజేయడం జరుగుతుందని వివరించారు. అలాగే భూసార పరీక్షల గురించి వాటి ఫలితాలను గురించి క్షుణ్ణంగా రైతులకు ఏడి బొగ్గు రజిని వివరించారు. ఈ కార్యక్రమంలో టి అలేఖ్య, రాజశేఖర్, రమణమూర్తి, రైతులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సొంత నిధులతో స్టెప్స్ నిర్మాణం



**సారవకోట/జలుమూరు, జులై3 (వార్త):** సారవకోట మండలం గుమ్మపాడు పంచాయతీ అక్కివలస గ్రామంలో వంశధార మెయిన్ లెఫ్ట్ సైడ్ కెనాల్ పైన అక్కివలస గ్రామస్థుడు హనుమంతు రామారావు కుమారుడు హనుమంతు చిన్నికృష్ణ తమ సొంతనిధులు రూ.1.20 లక్షలతో స్టెప్స్‌ను నిర్మించారు. బుధవారం ఈ స్టెప్స్‌ను టీడీపీ సారవకోట మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హనుమంతు లక్ష్మీనారాయణ, వెంకటరమణ మూర్తి, రాజు, ఇట్రారాజుల శ్యాం, ఇలపండి లక్ష్మణ్, సత్తారు సీతారాం, రెడ్డి కృష్ణమూర్తి, కూర్మాపు ఈశ్వర్, కూర్మాపు ఈశ్వర్, రాము, బోరిగి భాస్కర్, పేడాడ అప్పలనాయుడు, ఇలాపండి బాలకృష్ణ, బామ్మిడి సంతోష్, హనుమంతు సన్యాసినాయుడు, ఐలపండి రమణమ్మ, దుప్పల రామన్న పాల్గొన్నారు.

# తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే దివ్యాంగులకు లబ్ధి





**నరసన్నపేట/జలుమూరు, జులై3 (వార్త):** నరసన్నపేటలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర దివ్యాంగుల కమిటీ సెక్రటరీ ఊర్న సాయి, జిల్లా దివ్యాంగుల కమిటీ అధ్యక్షుడు గురుబిల్లి రమణమూర్తితో పాటు దివ్యాంగులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే దివ్యాంగులకు లబ్ధి కలుగుతుందని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేర్చారని తెలిపారు.

## విద్యకు అధిక ప్రాధాన్యం

**పోలాకి:** మబగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యాకిట్లను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోండి



**కంచిలి, జులై 3 (వార్త):** విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని స్థానిక మండల విద్యాశాఖ అధికారి సప్పటి శివరాం ప్రసాద్ అన్నారు. బుధవారం కంచిలి మండలంలో ఎమ్మెస్‌పల్లి, డీజీపురం పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాకిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బంగారు కురయ్యా, మాదిన రామారావు, పిలక చిన్నబాబు, పైల మన్మధ రెడ్డి, మర్రిపాటి పూర్ణ, సనపల కామేష్, టీవీ రమణ, రమేష్ మహంతి, కిషోర్ పాడి, శ్రీకాంత్, వంశీ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గౌతు శిరీష పర్యటన

**మందస, జులై 3 (వార్త):** మందస మండలంలోని సువర్ణాపురం, దున్నవూరు, కొయిటసాయి గ్రామాల్లో ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం పర్యటించారు. దున్నవూరు గ్రామానికి చెందిన పిచ్చుక జోగమ్మను పరామర్శించారు. కొయిటాసాయి గ్రామంలో పోతురాజులమ్మ అమ్మవారి దేవాలయంలో పూజలు చేశారు. ఆమె వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.



## పూర్వ విద్యార్థుల చేయూత

**బూర్జ, జులై3 (వార్త):** మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు పాలకొండ మండలం అంపిలి గ్రామానికి చెందిన సహచర విద్యార్థి రేగాన రాజేష్ కుటుంబానికి బుధవారం రూ.20వేలు ఆర్థికసాయం చేశారు. ఇటీవల అనారోగ్యంతో రాజేష్ మృతి చెందాడు. దీంతో రాజేష్ కుటుంబానికి మద్దతుగా పూర్వవిద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో వారాడ రాంబాబు, పైల సత్యన్నారాయణ, కింజరాపు హరినాథ్, గడ్డి నీలయ్య తదితరులు పాల్గొన్నారు.





## పురుషోత్తపురంలో ఉచిత వైద్య శిబిరం

**ఇచ్ఛాపురం, జులై3 (వార్త):** పురుషోత్తపురంలోని ఒకటో వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్, రెండో వార్డు కౌన్సిలర్ చాట్ల పుష్ప తిరుపతి ఆధ్వర్యంలో శ్రీకాకుళం జెమ్స్ హాస్పిటల్ వైద్యులు బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ దినేష్ 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్యసిబ్బంది పద్మ, నాయుడు, చిన్నారావు, సంతోష్ కుమార్ సేవలు అందించారు. కార్యక్రమంలో కొంతాల రామ్మూర్తి, దానయ్య, కొంతల ఢిల్లీ, ఆర్.ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జింకపై కుక్కల దాడి

**మందస, జులై 3 (వార్త):** మందస చుట్టుపక్కల ఉన్న అడవుల నుంచి ఓ చుక్కల జింక తప్పించుకుని మందస పట్టణంలోని జనావాసాల మధ్యకు చేరుకుంది. జింకను చూసిన కుక్కలు వెంటపడి తరిమి గాయపరిచాయి. భయంతో ఓఇంటిలోకి జింక దూరింది. స్థానికులు దాన్ని చేరదీసి అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి జింకకు వైద్య మందించారు. అనంతరం అడవుల్లో విడిచిపెట్టారు.



## గుప్పిడిపేటలో గ్రామసభ

**పోలాకి/జలుమూరు, జులై 3 (వార్త):** పోలాకి మండలం గుప్పిడిపేట గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది అంగన్వాడీలు, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులు చేసేందుకు గుర్తించారు. ప్రతి మూడు నాలుగు నెలలకోసారి గ్రామసభ నిర్వహించి సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించాలని నిర్ణయించారు. గ్రామసభలో గ్రామ సర్పంచ్ నందిపిల్లి పైడితాత, ఎంపీటీసీ పైడమ్మ, జనసేన పార్టీ పోలాకి మండల అధ్యక్షుడు నందిపిల్లి దండాసి, గ్రామ పెద్దలు నందిపిల్ల అప్పయ్య, గుంటు దానేసు, బుడగట్ల కిరణ్ కుమార్, చక్క రాజయ్య, కదిరిగురయ్య, కురమయ్య పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను వాడొద్దు



**ఇచ్ఛాపురం, జులై 3 (వార్త):** పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను ఎవరూ వాడవద్దని జ్ఞాన భారతి స్కూల్ సెక్రటరీ జోహార్ ఖాన్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పూర్తిగా బహిష్కరిస్తామని, ప్లాస్టిక్ వ్యర్థాలపై సమాజంలో అందరికీ అవగాహన కల్పిస్తామని, వర్తమాన, భవిష్యత్తు కాలాలలో ప్లాస్టిక్ లేకుండా చేసేందుకు అందరినీ కార్యోన్ముఖులను చేస్తానని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోహార్ ఖాన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రేపటి పౌరులైన విద్యార్థులపై మరింత ఎక్కువ బాధ్యత ఉందని చెప్పారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని తమ జీవితాల నుంచి దూరంగా ఉంచాలని, అదే దిశగా సమాజానికి చైతన్యం కలిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఇందు పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవం



**ఇచ్ఛాపురం, జులై 3 (వార్త):** జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ప్రతి అన్వేష్ ఆధ్వర్యంలో ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవం నిర్వహించారు. బుధవారం హాస్పిటల్ రోడ్‌లో గల కార్యాలయంలో ఇచ్ఛాపురం మండల పాస్టర్ల ఫెలోషిప్ సౌజన్యంతో వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. చర్చిలో ఉన్న నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి గోపాల్, వీరబాబు, బిమ్మో బెహరా, ప్రభు దాస్, ప్రకాష్ పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి

*** మండల సమావేశంలో సభ్యులు డిమాండ్**




**ఇచ్ఛాపురం, జులై 3 (వార్త):** ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని బిర్లంగి ఎంపీటీసీ దక్కత ఏకాంబరి దేవి కోరారు. బుధవారం ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన మండల సాధారణ సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాలు రుణాలు తీసు కున్న సమయంలో సిఎఫ్‌లు అక్రమంగా మహిళా సంఘాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులకు తెలియ జేశారు. సీఎఫ్‌లకు వేతనాలు ఎవరు ఇస్తారు, కొత్తగా ఎవరినైనా నియమించారా అని కేసుపురం ఎంపీటీసీ మాసుపత్రి చక్రవర్తి ఏపీఎంను ప్రశ్నించారు. ప్రభుత్వం వేతనం చెల్లిస్తుంటే మహిళా సంఘాలకు సిఎఫ్‌లు రుణాలు తీసుకునేటప్పుడు మహిళల నుంచి ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని నిలదీశారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీఎం ప్రసాద్‌కు ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ చర్చ జరిగినప్పుడు వైద్యాధికారి డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరుచుకోవాలని, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటింటికి ఆరోగ్య సేవలపై సర్వే చేస్తున్నామని తెలిపారు. ఇటీవల పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వకుండా అధికారులు పింఛన్లు ఏవిధంగా పంపిణీ చేస్తున్నారని ఈదుపురం సర్పంచ్ ప్రసాద్ ప్రశ్నించారు. ప్రోటోకాల్ ఉల్లంఘనపై సభలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇటీవల కేసుపురం వద్ద బహుదా నదిలో నిర్మించిన గ్రోయిన్‌లో నీరు లీక్ అవుతుండడం వల్ల రైతులకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని సర్పంచ్ ఢిల్లీరావు, ఎంపీటీసీ చక్రవర్తి సభలో ప్రస్తావించారు. ఈ విషయంపై స్థానిక రైతులు, అధికారులు గ్రోయిన్‌ను పరిశీలించి రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ రామారావు తెలిపారు. సమావేశంలో జడ్పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రక్తదాతలు.. అభినందనీయులు



**శ్రీకాకుళం టౌన్, జులై 3 (వార్త):** రక్తదాతలు అభినందనీయులని లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీ, శ్రీ సత్య సాయి భజనా మందిర ప్రాంగణంలో లైన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాతలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సారవకోట సచివాలయం పరిధిలో వెటర్నరీ సూపర్వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ సాహు తన తల్లి జ్యోతి సాహు ఐదో వర్ధంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్తం దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కోరారు. కార్యక్రమం లో మెంటార్ నటుకుల మోహన్, రౌతు సుప్రజ, పొడుగు చరణ్, నవీన్, ఉర్లం శివతేజ, లైన్స్ బ్లడ్ బ్యాంకు యాజమాన్యం, లయన్స్ క్లబ్ సెంట్రల్ సభ్యులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన శివశంకర్



నగరంలోని న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకులో జర్నలిస్టు శివశంకర్ బుధవారం రక్తం దానం చేశారు. రక్తదాతకు సమాజ సేవకుడు ఉర్లం శివతేజ అభినందించారు.

# క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయండి

*** జనసేననాయకుడు, ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్**

*** దానేటిని మర్యాద పూర్వకంగా కలసిన రాజాం నియోజకవర్గ జనసేన నాయకులు**



**శ్రీకాకుళం టౌన్, జులై 3 (వార్త):** ప్రముఖ వైద్యుడు, జనసేన నాయకుడు డాక్టర్ దానేటి శ్రీధర్‌ను రాజాం నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు శ్రీకాకుళం నగర పరిధిలో మెడికవర్ హాస్పిటల్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. దానేటి శ్రీధర్‌ను దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలు, లక్ష్యాల సాధనకు పార్టీలో ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణతో, త్రికరణ శుద్ధిగా కృషి చేయాలన్నారు. పవన్‌కళ్యాణ్‌పై ఉన్న నమ్మకంతో ప్రజలు 100 శాతం విజయాలను ప్రజలు అందించాలని అందుకు జనసేన నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ముఖ్యంగా ప్రజల మధ్యన ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు.

# చెట్లతోనే మానవ మనుగడ

**జిల్లా ఉద్యాన శాఖాధికారి వెంకటవర ప్రసాద్**

**శ్రీకాకుళం టౌన్, జులై 3 (వార్త):** మానవ మనుగడకు చెట్లను సంరక్షించాలని శ్రీకాకుళం జిల్లా ఉద్యానవనశాఖ సహాయ సంచాలకుడు రత్నాల వెంకటవర ప్రసాద్ అన్నారు. మొక్కలు నేలకోతను తగ్గించటంలో సహాయ పడతాయని తెలిపారు. బుధవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు గేదెల ఇందిరా ప్రసాద్, గజల్స్ గాయకుడు డాక్టర్ మంతెన వాసుదేవాచారి జన్మదినాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో హరిత వనాల పెంపకానికి వివిధ అనుబంధ శాఖల సహకారాన్ని తీసుకొని చర్యలు చేపట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ కో ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పి జి గుప్తా, రాడ కైలాసరావు, బి వి రవిశంకర్, బి. దేవీ ప్రసాద్, బొడ్డేపల్లి ప్రసాద్ రావు, సింహాద్రి వేణుగోపాల్, గంజి ఎజ్రా, బరాటం శ్రీనివాస్, రామ్ బాయి, స్రవంతి, వాసంతి, గేదెల లక్ష్మీ, గొర్ల వాసుదేవరావు, ఎస్.సంజీవరావు, మలిపెద్ది మల్లిబాబు, గోలీ ఉమామహేశ్వరరావు, సంతోష్ గురు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## ఎంపీ కలిశెట్టికి కృతజ్ఞతలు

**శ్రీకాకుళం టౌన్, జులై 3 (వార్త):** గ్రామీణ విలేఖరిగా ప్రస్థానం ఆరంభించి నేడు లోక్‌సభ సభ్యునిగా ఎన్నికై తనదైన శైలిలో సమస్యలను ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకువెళుతున్న కలిశెట్టి అప్పలనాయుడికి ఉత్తరాంధ్ర జర్నలిస్టు ఫ్రంట్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులకు టోల్ గేట్ల వద్ద వసూలు చేసే రుసుము నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరికి వినతిపత్రం ద్వారా కోరడం గొప్ప విషయమన్నారు.

## అసంపూర్తి రోడ్ల
# నిర్మాణాలను పూర్తి చేయండి

* ఎమ్మెల్యే గొండు శంకర్
* రోడ్ల మరమ్మతులపై అధికారులతో సమీక్ష



**శ్రీకాకుళం టౌన్, జులై 3 (వార్త):** నియోజకవర్గంలో రోడ్లు, డ్రైన్ల మరమ్మతులు చేయాలని, అసంపూర్తిగా రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. ఆర్అండ్‌బీ అధికారులతో బుధవారం ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు రహదారులు అధ్వానంగా మారాయన్నారు. పెండింగ్ పనులు, రోడ్ల మరమ్మతులకు సంబంధించి నివేదికను అందజేస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణాలపై ఆరా తీశారు. ప్రజలు తమపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో పట్టం కట్టారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేలా అధికారుల పనితీరు ఉండాలని చెప్పారు. రాష్ట్రంలోనే శ్రీకాకుళం నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ ఆండ్ బి అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

* ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ సూర శ్రీనివాసరావు * హాస్టల్ విద్యార్థులకు ఫ్యాన్లు, లైట్లు వితరణ

**శ్రీకాకుళం టౌన్, జులై 3 (వార్త):** విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఎస్ఎస్ఆర్ ఫౌండర్ డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. క్రమశిక్షణతో చదివితే లక్ష్యాలు చేరుకోవడం చాలా సులువని తెలిపారు. ఇంటర్మీడియట్ డిగ్రీలోనే మీ భవిష్యత్తుని నిర్ణయించుకోవచ్చున్నారు. శ్రీకాకుళం నగరంలో ప్రభుత్వ బిసి బాలికల కళాశాల వసతిగృహం-4 విద్యార్థినులకు ఫ్యాన్లు, లైట్లు అందించారు. ఈ సందర్భంగా సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పరీక్షలు పెద్ద సమస్య కానేకాదని, ఆత్మవిశ్వాసంతో ఇష్టంతో చదివి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. చదువుల్లో భవిష్యత్తులో రాణించాలంటే సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. ఫ్యాన్లు, లైట్లు వితరణ చేసినందుకు హాస్టల్ వార్డెన్ లలిత, విద్యార్థినిలు కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఆర్టీసీలో 16వ బ్యాచ్ ప్రారంభం



**శ్రీకాకుళం టౌన్, జులై 3 (వార్త):** శ్రీకాకుళం ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 16వ బ్యాచ్ ప్రారంభమైందని శ్రీకాకుళం-1 డిపో మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 15 బ్యాచ్‌లు పూర్తయ్యాయని, 16వ బ్యాచ్‌ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీఎస్ఆర్టీసీలో మాత్రమే హెవీ డ్రైవింగ్ స్కూల్ నడుపుతున్నారన్నారు. ఇక్కడ డ్రైవింగ్ నేర్చుకొని ఇప్పటివరకు చాలా ప్రభుత్వ శాఖల్లో డ్రైవర్లుగా నియమితులై ఉన్నారని, ఆర్టీసీలో కూడా ఆన్ కాల్ డ్రైవర్లుగా చాలా మంది పనిచేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో డ్రైవర్ల కొరత చాలా ఎక్కువగా ఉంటుందని అప్పుడు మీ అందరి సేవలు కూడా ఎంతో అవసరమని, ఇక్కడ డ్రైవింగ్ తో పాటు మెకానికల్ వర్క్, యోగ, ప్రథమ చికిత్స, వ్యక్తిత్వ వికాసం, రోడ్డు, ట్రాఫిక్‌నకు సంబంధించిన అన్ని విషయాలను కూడా నేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమేష్, డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్ వర్మ పాల్గొన్నారు.

## మినీ స్టేడియం పరిశీలన

**రణస్థలం, జులై 3 (వార్త):** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కొండములగాం సమీపంలో నిర్మించిన ఇండోర్ స్టేడియంను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం పరిశీలించారు. స్టేడియం నుంచి కొండ ములగాం ఆర్అండ్‌బి రోడ్డు అధ్వానంగా ఉండడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించారు. రోడ్డు పక్కన మురుగునీరు కొండ నుండి వచ్చే వర్షం నీరు వల్ల స్టేడియంలోకి వెళ్లలేకపోతున్నారని పలువురు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి ఈసమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం మినీ స్టేడియంలో క్రీడాకారులతో షటిల్ ఆడి వారిని ఉత్తేజపరిచారు.



## ఓంకార్ కుటుంబానికి సీదిరి పరామర్శ

**పలాస, జులై 3 (వార్త):** పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన యూటీఎఫ్ నాయకుడు, ఉపాధ్యాయుడు బత్తిన ఓంకార్ గుండె పోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బుధవారం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, మాజీ సర్పంచ్ తెప్పల అప్పల స్వామి, రాపాక చిన్నారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవ రావు ఉన్నారు.

## నేడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

* డివిజినల్, మండల, గ్రామస్థాయి లోనూ నిర్వహించండి * కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమున్

**శ్రీకాకుళం, జులై3 (వార్త):** అల్లూరి సీతా రామరాజు జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం ఉదయం 9.30 గంటలకు జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమున్ తెలిపారు. జిల్లా అధికారులు, కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న కార్యాలయాల అధికారులు సిబ్బంది ఈ వేడుకలకు హాజరు కావాలని ఆదేశించారు. అన్ని జిల్లా, డివిజినల్, మండల, గ్రామ స్థాయి కార్యాలయాల్లోనూ అల్లూరి జయంతి వేడుకలను నిర్వహించాలని సర్క్యులర్ జారీ చేశారు.

**పార్వతీపురం:** జిల్లాలో అల్లూరి జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించనున్నందున గురువారం ఉదయం 10:30 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు, కార్యాలయ సిబ్బంది అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.



## బాలుడికి వాకింగ్‌స్టిక్ అందజేత

**శ్రీకాకుళం టౌన్, జులై 3 (వార్త):** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మనందరి బాధ్యతని విజయనగరం జిల్లా, చీపురుపల్లికి చెందిన ఎస్.ఎల్.డి.వై ఫాన్సీ హబ్ నిర్వాహకుడు శంకర్ అన్నారు. ఎచ్చెర్ల మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కుప్పిలి సత్యనారాయణ, నాగమణిల కుమారుడు జస్వంత్ పోలియోతో బాధపడుతున్నాడు. ఈవిషయం శ్రీకాకుళం ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ఉమా శంకర్ చీపురుపల్లికి చెందిన శంకర్ దృష్టికి తీసుకువెళ్లాడు. జస్వంత్ నడవడానికి వీలుగా ఉండే వాకింగ్ స్టిక్ సెట్‌ను శంకర్ అందజేశాడు. కార్యక్రమంలో జస్వంత్ కుటుంబ సభ్యులు, రెడ్ క్రాస్ ప్రతినిధి పవన్ కుమార్, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యుడు పొడుగు చరణ్, నవీన్ పాల్గొన్నారు.

## గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



**శ్రీకాకుళం టౌన్, జులై 3 (వార్త):** నగరంలోని 17వ డివిజన్ పరిధిలోని గాజులవీధి అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఆ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ బస్వా రాజేష్ రెడ్డి బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. అలాగే ఎంసీపీ కార్డులను అందజేశారు. కేంద్రాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని ఎమ్మెల్యే వద్దకు తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తామన్నారు. మూడు నాలుగు నెలలు నిండిన గర్భిణీలు ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని, అప్పుడే పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఉమెన్ ప్రొటెక్షన్ అధికారి కె. ఎల్.రత్నకుమారి, ఐసీడీఎస్ అధికారులు ఎస్.నాగమణి, బి.సరస్వతి, సరిత, ఎ.ఉమాదేవి, జి.పద్మావతి, టీ.హైమావతి, ఎస్.లక్ష్మీ, పాతిమా బీగం పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి

**టెక్కలి, జులై 3 (వార్త):** టెక్కలి మండలం శాసనాం గ్రామ సమీప జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నందిగాం మండలం పెద్ద తామరపల్లి గ్రామానికి చెందిన పోలాకి వంశీ (28) ట్రాక్టర్ ఇంజిన్ కింద నలిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని టెక్కలి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నారు.

## నూతన కమిషనర్‌ను కలిసిన మున్సిపల్ నేతలు



**శ్రీకాకుళం టౌన్, జులై 3 (వార్త):** నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చల్ల ఓబులేష్‌ను ఏఐటీయూసీ అనుబంధ సంఘ మున్సిపల్ జిల్లా నాయకత్వం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛమిచ్చి దుశ్శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వేణుగోపాలరావు, కళ్యాణి అప్పలరాజు, ఎన్.పార్థసారథి, పెద్దమని, ఆర్.గణేష్, రామచంద్ర, అరుగుల రమణ, రసూల్, బి.కుర్మారావు, సోగ్గాడు పాల్గొన్నారు.

## బాబాల పేరిట మూఢత్వ ప్రచారాన్ని ఆపండి

**నరసన్నపేట, జులై 3 (వార్త):** దేశవ్యాప్తంగా అనేకమంది బాబాలు ప్రజల్లోని మూఢత్వాన్ని, అశాస్త్రీయ ధోరణిలను ఆసరా చేసుకుని పబ్బం గడుపుతున్నారని జన విజ్ఞానవేదిక శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో బోలో బాబా పాద దూళి కోసం జరిగిన తొక్కిసలాటలో 121 మంది చనిపోవడం, వందలాదిమంది గాయపడటం దురదృష్టకరమన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413